# సత్యవాక్కు

క్రైస్తవ మాస పత్రిక

THE WORD OF TRUTH



# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "స త్య వా ణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొందియున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సుళువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 15 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు-మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి !!

**SATYA VANI**
(P.O. Box 80) Sambhamurthi St.
KAKINADA-533 004

## ప్రకటన

318 క్రైస్తవ కీర్తనలు గల పుస్తకము ఇంకొకటి ఇప్పుడు లభించుచున్నది. దాని ఖరీదు రూ. 10/- లు; పోష్టు ఖర్చులు రూ. 1-50 అదనం. వలయువారు ఈ దిగువ సహోదరుని సంప్రదించండి.

T. PRAKASA RAO
Church Christ - Bible Learning Centre
KOMAROLE - 523|373.

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 12 | జూన్ 1992 | సంచిక 11

## సంపాదకీయము

### రక్షించునట్టి దేవుని కృప

### ( The Grace of God that Saves )

మానవుడొక పాపి. అతడు పాపపు అపరాధము వలన జన్మించుట వలన కాదుగాని తనకు తానే దేవుని ఆజ్ఞలను అతిక్రమించుట వలన పాపియైనాడు. దేవుని ఆజ్ఞాతిక్రమమే పాపము (1 యోహాను 3:4).

దేవుడు పరిశుద్ధుడు, పాపము లేనివాడు, పాపము చేయనివాడు గనుక పాపి లేక పాపము ఆయన యెదుట ప్రవేశించుట అసంభవము. పాపమునకు శిక్ష విధించబడి న్యాయము జరిగించబడాలని ఆయన కోరుచున్నాడు. అందువలన మానవుడేమి విత్తునో ఆ పంటనే కోయునని బైబిలు చెప్పుచున్నది (గలతీ 6:7, 8). పాపముచేయువాడే మరణము నొందుననియు, పాపము వలన కలుగు జీతము మరణమనియు బైబిలు బోధించుచున్నది (యెహెజ్కేలు 18:20; రోమా 6:23).

అయితే దేవుడు మానవుని సృష్టికర్త (ఆది 2:7). ఆత్మలను ప్రేమించువాడు (యోహాను 15:13), మరియు మనలో ఎవడును నశింపవలెనని యిచ్ఛయింపనివాడు (2 పేతురు 3:9). గనుక మానవుని పాపములకై తానే గొప్ప ప్రాయశ్చిత్తము చేయనెంచుకొన్నాడు (రోమా 5:11). పాపప్రాయశ్చిత్తార్థబలిగా పాపములేని తన ఏకైక కుమారుని ఆయన అర్పింపవలసి వచ్చెను. "దేవుడు లోకముతో ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వాని యందు విశ్వాసముంచు ప్రతి వాడును నశింపక నిత్య జీవముపొందు నట్లు ఆయనను అనుగ్రహించెను. లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకే గాని లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుడాయనను లోకములోనికి పంపించలేదు" (యోహా 3:16, 17).

"గనుక క్రీస్తుకూడ మీ కొరకు బాధపడి, మీరు తన అడుగు జాడల యందు నడుచుకొనునట్లు మీకు మాదిరి యుంచి పోయెను. ఆయన పాపము చేయలేదు, ఆయన నోటను ఏ కపటమును కనబడ లేదు. ఆయన దూషింపబడియు బదులు దూషింపలేదు. ఆయన శ్రమ పెట్టబడియు బెదరింపక, న్యాయముగా తీర్పుతీర్చు దేవునికి తన్ను తాను అప్పగించుకొనెను. మనము పాపము విషయమై చనిపోయి, నీతి విషయమై జీవించునట్లు ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసికొనెను. ఆయన పొందిన గాయ ములచేత మీరు స్వస్థత నొందితిరి" (1 పేతురు 2:21-24). "ఏల యనగా మనమింక బలహీనులమై యుండగా క్రీస్తు యుక్తకాలమున భక్తిహీనుల కొరకు చనిపోయెను. నీతిమంతుని కొరకు సహితము ఒకడు చనిపోవుట అరుదు; మంచివాని కొరకు ఎవడైన ఒకవేళ చని పోవ తెగింపవచ్చును. అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడి పరచుచున్నాడు; ఎట్లనగా మన మింకను పాపులమై యుండ గానే క్రీస్తు మనకొరకు చనిపోయెను (రోమా 5:6-8).

పరిస్థితి ఇట్లున్నది: తన్ను తాను రక్షించుకోలేని మానవుడు మనకు కనబడుచున్నాడు. అతడు నాశనమైపోవు చున్నాడు. పాపమునకు శిక్ష విధించబడాలి గనుక మానవుడు పాపము వలన నాశనమయే పరిస్థితిలో యున్నాడు. అయితే దేవుడు ఇప్పుడు దృశ్యములోనికి వచ్చుచున్నాడు. ఆయన మానవుని ఎంతగా ప్రేమించుచున్నాడంటే అతని రక్షించుటకొరకు తన ఏకైక కుమారుని సహితము బలి యిచ్చుట కాయన నిశ్చయించుకొన్నాడు. కృప అంటే అదే. దాన్ని పొందడానికి అర్హత లేకపోయినను దేవుడు దాన్ని మనకిచ్చు చున్నాడు. మానవుడు తన్ను తాను రక్షించుకోలేని స్థితిలో యున్నపుడు, అతని రక్షించడానికి క్రీస్తే తన్ను తాను అర్పించుకొన్నాడు. యిది సాటిలేని బహుమానము. దీనంతటికీ బదులుగా మానవుడు దేవునికి యేమి అర్పించినా తీరదు. అతడు మితిలేని నీతి క్రియలు చేయాలని తలపెట్టినా అవి సరిపోవు; అతడు ఆజ్ఞలన్నిటికీ విధేయుడైనా అది కూడ సరిపోదు; అతడు కోలెడంత ధనాన్ని యిచ్చి, ఎంతో ఆరాధించి, ఎంతో త్యాగము చేసి, ఇంకా ఎన్నెన్నో సంగతులు ఎంతో చేసి వాటిద్వారా నా రక్షణను సంపాదించుకొన్నానని చెప్పజాలడు. అందుకే "మీరు విశ్వాసముద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు; ఇది మీ వలన కలిగినది కాదు. దేవుని వరమే. అది క్రియల వలన కలిగినది కాదు గనుక ఎవడును అతిశయపడ వీలులేదు" అని అపొ. పౌలు చెప్పుచున్నాడు (రోమా 2 : 8-9).

మనము కృప చేతనే రక్షింపబడు చున్నను, రక్షింపబడుటకు మరతులేమీ లేవని గాని, లోబడుటకు ఆజ్ఞలేమీ లేవని గాని దీని యర్థము కాదు. మనము విశ్వాసముద్వారా కృపచేతనే రక్షింపబడు చున్నామని ఆత్మావేశ లేఖకుడు చెప్పియున్నాడు. మానవుడు రక్షింపబడగల్గునట్లు దేవుడు తన కృపను కనుబరచాడు. అయితే మానవుడు విశ్వాసముద్వారా ఆ కృప పొందడానికి ప్రయత్నించాలి.

దేవుని వాక్యమును వినుటద్వారా విశ్వాసము కలుగును (రోమా 10:17). విశ్వాసము లేకుండా దేవుని కిష్టుడై యుండుట అసాధ్యము. గనుక విశ్వాసముద్వారా మనము దేవుని ఆజ్ఞలకు లోబడాలి.

మానవునికి విశ్వాసము కలుగునట్లుగా క్రీస్తు సువార్త సర్వ మానవాళికి ప్రకటింపబడాలని ఆయన ఆజ్ఞాపించాడు. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మని వానికి శిక్ష విధించబడునని" ఆయన చెప్పాడు (మార్కు 16:15, 16). నమ్మిన వానిని క్రీస్తు రక్షించును గాని నమ్మని వానిని ఆయన శిక్షించును. ఆయనయందు నమ్మికయుంచియు ఆయనకు లోబడని వానికి రక్షింపబడుటకు చాలినంత బలమైన విశ్వాసము లేదని యర్థము.

అయితే మనము విశ్వసించి విధేయత చూపుటలో దేవుని కృప నిరర్థకము కాదు. ఒకడు విధేయుడైనను అతడు దేవుని కృప వలననే రక్షింపబడును. ఇదంతయు దేవుని కృప వలననే సాధ్యమాయెను; చివరకు మానవుని విధేయత కూడ ఆయన కృపను బట్టియే సాధ్యమాయెను. అయితే ఆయనకు విధేయత చూపుటకు నిరాకరించు వారికి ఆయన కృప వర్తించదు.

ఈ లోకంలో దేవుని కృప వలననే మనము రక్షింపబడుచున్నాము. మరల దేవుని కృప వలననే నమ్మకముగా యున్న వారు నిత్యజీవములో ప్రవేశింతురు. దేవుని కృప వలన రక్షింపబడిన క్రైస్తవులతో అపొ. పౌలు చెప్పిన మాటలను జ్ఞాపకము చేసికొందము: "ఏలయనగా సమస్త మనుష్యులకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమై మనము భక్తిహీనతను, ఇహలోక సంబంధమైన దురాశలను విసర్జించి, శుభప్రదమైన నిరీక్షణ నిమిత్తము అనగా మహా దేవుడును మన రక్షకుడునైన యేసుక్రీస్తు మహిమయొక్క ప్రత్యక్షత కొరకు ఎదురు చూచుచు ఈ లోకములో స్వస్థబుద్ధితోను, నీతితోను, భక్తి

తోను బ్రతుకుచుండవలెనని మనకు బోధించుచున్నది. ఆయన సమస్తమైన దుర్నీతినుండి మనలను విమోచించి, సత్క్రియలయం దాసక్తిగల ప్రజలను తనకోసరము పవిత్రపరచుకొని తన సొత్తుగా చేసికొనుటకు తన్నుతానే మన కొరకు అర్పించుకొనెను" (తీతు 2 : 11-14).

★

## కన్నీళ్ళపై కొన్ని పాఠాలు
## ( Some Lessons on Tears )

కన్నీళ్ళు కార్చడం ఒక బలహీనత యని, గనుక ఎవరికీ కనబడకుండా ఆ పని చేయాలని ఈ లోకం తలస్తాది. అయితే ఒక ప్రఖ్యాత జీవశాస్త్రవేత్త యగు Dr. ఏష్లే మోంటేగు ఇట్లనుచున్నాడు: "నీవు కన్నీళ్లు కార్చవలసి వస్తే సిగ్గుపడవద్దు గాని గర్వించు. అప్పుడు ప్రకృతి ఏర్పరచుకొన్న కొద్ది వారిలో నీవొకడవు (దానివి) అగుదువు. భావోద్రేకంగా సంచలించినప్పుడు కన్నీళ్లుకార్చే దేవుని సృష్టము మానవుడొక్కడే". పరలోకంలో మన ప్రతి బాష్ప బిందువును తుడిచివేతునని దేవుడు వాగ్దానం చేసినందున (ప్రక 21 : 4), అక్కడ అవి తుడిచివేయబడాలంటే ఇక్కడ మనం కన్నీళ్లు కార్చడం విధియే.

మనం చేసిన పాపముల వలన మనకు కన్నీళ్ళు రావాలి. ప్రభువునుగూర్చి బొంకినప్పుడు పేతురు పాపం చేసాడు. యేసు అతని కెంతో చేసాడు, అతని అత్తను ఆయన స్వస్థపరచాడు మరియు పరలోకరాజ్య (క్రీస్తు సంఘు) ద్వారముల తాళపు చెవుల నతనికిచ్చాడు. అంతేకాదు పేతురే ప్రభువుకు గొప్ప వాగ్దానాలు చేసాడు; అయితే యిప్పుడాయనను గూర్చి అతడు బొంకాడు. తాను చేసిన పాపము నతడు గ్రహించుకొన్నప్పుడు అతడు "వెలుపలికి పోయి సంతాపపడి యేడ్చెను" (మత్తయి 26:75).

ప్రభువు కొరకు ఎట్టివారిగా మనం యుండాలో, లేక ఆయన కొరకు యేమేమి చేయగలమో అను వాటిని గూర్చి మనం పునరా లోచన చేసికొన్నప్పుడు, మనం యేడ్వవలసి వస్తాది. "అతడు గనుక తన జీవితాన్ని మార్చుకొని యుంటే మంచి క్రైస్తవుడు, బోధకుడు, నాయకుడై యుండేవాడని" మనం ఎంతమందిని గూర్చి చెప్పుకోలేము! అయితే తమ జీవితాలు మార్చుకోలేనందున వారిది విషాదాంతమే. వారిని గూర్చి మనం యేడ్వాలి.

ఇతరులు మనలను దూషించినప్పుడు సాధారణంగా మనకు కన్నీళ్లు వచ్చేస్తాయి. శారావలన అరణ్యములోనికి తరిమివేయబడిన హాగరు తన పిల్లవానికి యెదురుగా కూర్చుండి యెలుగెత్తి యేడ్చెను (ఆది 21:16). తనకు రావలసిన దీవెనలను యాకోబు పొందియున్నాడని ఏశావు గ్రహించినప్పుడు అతడు కూడ ఎలుగెత్తి యేడ్చాడు (ఆది కా. 27 : 38). బంధువులు, మితుృలు, తోటి పనివారు చేసే దూషణను తప్పించుకొన్నవారు బహుకొద్దిమందే యుంటారు. ఇతరులు మనలను దూషించునప్పుడు యేడ్పు కొట్టుకొస్తాది.

రోగం, మరణం సంభవించినప్పుడు కన్నీళ్లు కుండలగా కారి పోతాయి. తన భార్యయైన శారా మృతి పొందినప్పుడు, "అబ్రాహాము శారా నిమిత్తము అంగలార్చుటకును ఆమెను గూర్చి యేడ్చుటకును వచ్చెను" అని బైబిలు చెప్పుచున్నది (ఆది కా. 23 : 2). యేసు బేతనియకు వెళ్ళి మరియ మార్తల యొక్క దుఃఖాన్ని పంచుకొన్నాడు. "యేసు యేడ్చెను" (యోహా 11 : 35). "నీవు మరణమవుతావు, బ్రతుకవు గనుక నీ యిల్లు చక్కబెట్టుకొనుమని" దేవుని హిజ్కియాకు తెలియజేయగా హిజ్కియా కన్నీళ్లు విడుచుచు యెహోవాను ప్రార్థించెను" (2 రాజులు 20 : 1-3). మరణకరమైన రోగము వలన కన్నీళ్లు కార్చుట సహజమే.

అంతేకాదు, సంతోషం వలనకూడ కన్నీళ్లు కలుగును. ఆటగాళ్ళు ఒలింపిక్ పందెములలో బహుమానము నందుకొన్నప్పుడు అత్యానందంతో కన్నీళ్లు విడువడం మనకు తెలుసు. లేదా మన పిల్లలు ఏదైనా మంచిని సాధించినప్పుడు మనకు ఆనందబాష్పాలు రాలుతాయి. ఒక్కోసారి మన ప్రియులు బాప్తిస్మం పొందడానికి ముందుకు వచ్చినప్పుడు కూడ మనకు ఆనంద బాష్పాలు రాల వచ్చును.

మనం ఈ లోకంలో నశించిపోవుచున్న వారిని గూర్చి బహుగా ఎక్కువ ఏడ్వాలి. "నా జనులలో హతమైన వారిని గూర్చి నేను దివారాత్రము కన్నీళ్ళు విడుచునట్లు నా తల జలముగాను నా కన్ను నీళ్ళ ఊటగాను ఉండును గాక" యని యిర్మియా విలపించాడు (యిర్మి 9:1). పాపమువలన హతమార్చబడిన దేవుని ప్రజలనుగూర్చి నీ వెప్పుడైనా దుఃఖించావా! యెరూషలేము పట్టణమును గూర్చి యేసు ప్రలాపించాడు: "యెరూషలేమా, యెరూషలేమా, ప్రవక్తలను చంపుచును నీయొద్దకు పంపబడిన వారిని రాళ్ళతో కొట్టుచును ఉండుదానా, కోడి తన పిల్లలను రెక్కలక్రింది కేలాగు చేర్చుకొనునో ఆలాగే నేనును నీ పిల్లలను ఎన్నోమారులు చేర్చుకొనవలెనని యుంటిని గాని మీరు ఒల్లకపోతిరి". (మత్తయి 23 : 37). పౌలు రాత్రింబగళ్ళు కన్నీళ్ళు విడుచుచు ప్రతి మనుష్యునికి మానక బుద్ధి చెప్పెను (అపొ. కా. 20:31).

మంచివారు తేలికగా ఏడుస్తారని ఒక గ్రీకు పద్యకారుడు చెప్పాడు. "కన్నీళ్ళు విడుచుచు విత్తువారు సంతోష గానముతో పంట కోసెదరు. పిడికెడు విత్తనములు చేత పట్టుకొని యేడ్చుచు పోవు విత్తువాడు సంతోష గానము చేయుచు పనలు మోసికొని వచ్చును" (దా. కీర్త 126 : 6). దేవుడు పరలోకంలో మన ప్రతి బాష్పబిందువును తుడిచి వేయును. అది ఎంత ఆనందదాయక దినమగునో గదా!

—లియాన్ కోల్.

# సారెపతు విధవరాలు

## ( The Widow of Zarephath )

కొంత మంది జీవితముల ద్వారాను, వారి క్రియల ద్వారాను జీవ మరణములను గూర్చి నట్టియు, విశ్వాస, జ్ఞానములను గూర్చి నట్టియు విషయములను నేర్చుకొనగలము. భయంకర కరవులో ప్రవక్తయైన ఏలీయాకు ఆశ్రియమిచ్చి పోషించిన సారెపతు విధవ రాలిం గూర్చి మనము కొన్ని విషయములు తెలిసికొందము (1 రాజులు 17:8-24).

### ఈ పాఠ్యాంశములో వ్యక్తులు :

యొర్దానుకు తూర్పున తిష్బీ అను గ్రామమున ఏలీయా అను వ్యక్తి ఇశ్రాయేలీయులకు ప్రవక్తగా యుండెను. ఇతడు యెహోవా ప్రవక్తగా స్థిరపడెను. ప్రవక్త అనబడెడు వ్యక్తి దేవునికి బదులు జనులతో మాట్లాడును (నిర్గమ 4 : 16). దేవుని మాటలు జనులతో చెప్పునప్పుడు భవిష్యద్విషయములను ప్రవక్త తెలియపరచవచ్చు; తెలియపరచకపోవచ్చు. ఏలీయా నిప్పువంటి ప్రవక్త యని రెండు విషయముల ద్వారా దేవుడు ధృవపరచెను (2 రాజులు 1:10).

తిష్బీయుడైన ఏలీయా ప్రవక్త కొన్ని ప్రత్యేక లక్షణముల వ్యక్తి. ఇతడు అందరితోను కలసి నివసించక ఒంటరిగా అరణ్య ప్రదేశము లలో నివసించుచుండేవాడు. అతడు వివాహము చేసికొనలేదు. ఇతడు గొంగళి ధరించుకొని నడుమునకు తోలుదట్టి కట్టుకొనెడివాడు (2 రాజులు 1 : 8). అతను విగ్రహారాధనను ఖండించెడి విధమును బట్టి ధైర్యము గాను, నిర్మొహమాటముగను గద్దించెడి గద్దింపులను బట్టి ఏలీయా ప్రవక్తను బట్టి భయము చెందుచుండెడివారు (1 రాజులు 19 : 10).

సారెపతు విధవరాలికి ఏలియా కనబడుసరికి అతడు నిరాశ్రయుడై నిరాదరణతో, ఆకలితో అలమటించు చున్నాడు.

మన కథానాయకురాలు ఒక విధవరాలు. ఆమెకు పోషించు కొనుటకు ఒక కుమారుడు గలడు. ఈ విధవరాలు చాల పేదరాలు. ఆ దినములలో పింఛనులుగాని, జీవిత భీమాలుగాని, ప్రభుత్వ సహాయములు గాని విధవరాండ్రకు లేవు. ఆమెకు, ఆమె కుమారునికి సరిపడు ఆహారము ఒక్క పూటకు మాత్రమే వారికున్నది. మరికొంత ఆహారము దొరుకునను నమ్మిక ఆమెలో లేదు. ఆమె ముఖములో ఆకలి బాధ కనబడుచున్నది. ఆమె అన్యురాలు. మధ్యధరా సముద్ర ప్రాంతములోని తూరు, సీదోనుల మధ్య గల సారెపతు నగరము ఈ విధవరాలిది.

ఇశ్రాయేలు రాజైన అహాబు, సీదోనీయులకు రాజైన ఎత్బయలు కుమార్తెయైన యెజెబెలును వివాహము చేసుకొని బయలు దేవతను పూజించుచు వానికి మ్రొక్కుచుండెను (1 రాజులు 16:31). తన తండ్రి పరిపాలన చేయుచుండిన రాజ్యములో యెహోవా ప్రవక్తల కొరకు యెజెబెలు వెదకుచుండెను.

ఇటువంటి భయంకరమైన పాలన గలిగిన రాజ్యములో ఈ విధవరాలు ఎంత పేద స్థితిలో యుండినను దయ, కనికరము, ఆదరించే స్వభావము గల వ్యక్తిగా జీవించుచుండెను.

## కాలము

సుమారు క్రీ॥పూ॥ 905 సం॥లో అహాబు, యెజెబెలులు పరిపాలించుచుండిరి. అసమర్థుడైన తన భర్తను తన స్వకీయులవలె బయలు దేవతను పూజించునట్లు యెజెబెలు మార్చెను. వారిరువురును పూర్తిగ

విగ్రహారాధికులుగ మారిపోవుట మాత్రమే గాక యెహోవాకు విరోధులుగ నైరి. ఆయన సేవకులను చంపించుటకు వారిరువురు యెప్పుడూ సిద్ధముగ యుండేవారు. ముఖ్యముగ యెహోవా ప్రవక్తయై యదార్థము చెప్పుటలో పొరబాటును ఖండించుటలో ఏమాత్రము వెనుకాడక ధైర్యము వహించియుండే ఏలియాను చంపుటకు ఆలోచన కలిగి యుండిరి.

దుర్మార్గులైన ఆ పరిపాలకుల కాలములో వారి దేశము మీదికి మిక్కిలి కరువును యెహోవా పంపించెను. అది ఏలియా ప్రార్థనా ఫలితము వలన కలిగినట్టిది (యాకోబు 5 : 17). మంచివారి మీదకు, చెడ్డవారి మీదకు ఆ కరువు మిక్కిలి భారముగ యుండెను (మత్తయి 5 : 45).

## సారెపతు ద్వారము దగ్గర

తన ఆఖరి భోజనము వండుకొనుటకై కొన్ని పుల్లలు ఏరుకొనుటకై వచ్చిన ఈ విధవరాలిని పుల్లలు ఏరుకొనుచుండగా ఏలియా కలుసుకొనెను (1 రాజులు 17:8-12). ఏలియాయొక్క శరీరాకృతిని చూచి ఆ విధవరాలు ఎట్లు ప్రతిస్పందించునో మనము ఊహించుకొనగలము. ఈ ఆధునిక యుగములో ఏ స్త్రీ యైనను సరే ఒక పొడవాటి గడ్డము గలిగి, గొంగళి కప్పుకొని, చూచుటకు వికారముగ యున్న వ్యక్తిని చూచుసరికి ఒక విధమైన భయముచే ఆవరించబడును. అదేరీతిలో ఈ విధవరాలు కూడ ఏలియాను చూడగానే భయపడి యుండును. ఏలియా ఆమెను చూచి ఆమెను పిలిచి త్రాగుటకై పాత్రలో కొంచెము నీళ్లు తీసుకురమ్మని అడిగెను. అందుకామె సంతోషముతో ఆ పని చేయుటకు ఒప్పుకొనెను. ఆమె నీళ్లు తేబోవుచుండగా మరల పిలిచి ఒక రొట్టె ముక్కను తనకొరకు తీసికొని రమ్మనెను. అందు కామె అంగీకరించక తొట్టిలో పట్టెడు పిండియు, బుడ్డిలో కొంచెము

నూనెయు నాయొద్ద నున్న వేగాని అప్పమొకటైన లేదు. మేము చావకముందు నేను ఇంటికి పోయి వాటిని నాకును నా బిడ్డకును సిద్ధము చేసికొనవలెనని కొన్ని పుల్లలు ఏరుటకై వచ్చితిననెను. అప్పుడు ఏలియా ఆమెతో ఇట్లనెను: భయపడవద్దు, పోయి నీవు చెప్పినట్లు చేయుము; అయితే అందులో నాకొక చిన్న అప్పము మొదట చేసి నా యొద్దకు తీసికొని రమ్ము, తరువాత నీకును, నీ బిడ్డకును అప్పములు చేసికొనుము. భూమిమీద యెహోవా వర్షము కురిపించు వరకు ఆ తొట్టిలో ఉన్న పిండి తక్కువకాదు, బుడ్డిలో నూనె అయిపోదని ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా సెలవిచ్చి యున్నాడనెను (1 రాజులు 17 : 13-14). దైవజనుని మాటలు విధవరాలు నమ్మెను. తన ఆఖరి భోజనమును దైవజనునితో పంచుకొని దీవెన పొందెను (మత్తయి 10:41). దేవుని సేవకుని ఒకరు చేర్చుకొనిన అది దేవుని చేర్చుకొనినట్టే (మత్తయి 10:40). ఆమె దేవునికి ఇచ్చెను. దేవుడామెకు తిరిగి అనుగ్రహించెను (లూకా 6 : 38). ఆమె దాతృత్వము ఆమెను ఆకలిగ ఉండనీయక తాను ఊహించిన రీతిగా సమృద్ధిగ భుజించుటకు దోహదపడెను.

## విశ్వాసము యొక్క రెట్టింపు ఫలితము

అటు తరువాత ఆ విధవరాలి కుమారుడు రోగియై ప్రాణము నిలువజాలనంత వ్యాధి గలవాడయ్యెను (1 రాజులు 17:17-24). ఆమె తన కుమారుని గూర్చి ఎంతో దుఃఖించుచు తాను పాపము చేసితినేమో, తన పొరబాటు కొరకై తన కుమారుడు బలియై పోయెనా? అని తలంచుచుండెను. అయితే పవిత్రమైన ఏలియా ఆమె పొరబాటునుబట్టి గాని, అవిశ్వాసమునుబట్టి గాని యిది సంభవించెనే యని నిందించక దేవుని సన్నిధిలో ఈ బిడ్డను గూర్చి వేడుకొనెను. తన కొరకు ఎంతో ఉపకారము చేసిన విధవరాలి కుమారునికి తిరిగి

ప్రాణము ననుగ్రహించుమని దేవుని అడుగుటకు ఏలీయా ఏమి వెనుకాడలేదు. ముమ్మారు ఏలీయా దేవునికి ప్రార్థించి చిన్నవానికి ప్రాణము మరల రాజేయుమని వేడుకొనెను. యెహోవా ఏలీయా చేసిన ప్రార్థన ఆలకించి ఆ చిన్నవానికి మరల ప్రాణము రానిచ్చినపుడు వాడు బ్రతికెను (1 రాజులు 17:21-22). ఏలీయా ఆ చిన్నవాని తీసికొని తల్లికి అప్పగించెను. ఎంతో దుఃఖించుచున్న తన తల్లిని కుమారుడు గట్టిగా కౌగలించుకొనినపుడు ఆ సమయము ఎంత ఆనందకరమైనదో మనము ఊహించగలము. ఆనంద బాష్పములు వారి కన్నులనుండి రాలి యుండునుగదా.

ఆ స్త్రీ ఏలీయాతో నీవు దైవజనుడవై యున్నావనియు, నీవు పలుకుచున్న యెహోవా మాట నిజమనియు అందుచేత నేనెరుగుదు ననెను (1 రాజులు 17 : 24). ఇది విశ్వాసము యొక్క ఒప్పుకోలు. ఇది చాల గంభీరమైనది.

## మనము తెలిసికొనదగు విషయములు

ఆశీర్వాదములు మనము ఊహించని పరిస్థితుల యందు సాధారణముగ కలుగుచుండును. తన ప్రియమైన కుమారుని మరణమునందు సహా విధవరాలు దీవెనలు పొందగలిగినది. అది ఆమెయొక్క సంపూర్ణ విశ్వాసతకు తోడ్పడినది. అది ఆమె తనయొక్క పాపములను గూర్చిన చింతన కలిగి యుండుటకు తోడ్పడినది. ఈ అనుభవము ద్వారా ఆమె మరణ పునరుత్థానములను గూర్చిన అవగాహన కలిగియున్నది. దేవుని మార్గములను అనుసరించుటకు నేర్చుకొనినది. మేలు కలుగుటకై సమస్తమును సమకూర్చి జరిగించుటకు శక్తిమంతుడైన ఇశ్రాయేలీయుల దేవుని శక్తిని ఎరిగి యున్నది (రోమా 8:28).

దేవుడు తన బిష్టులైన వారికి సహాయము చేయుటకుగాను

కొన్నిసార్లు అనామకులైనట్టి వారిని కూడ ఉపయోగించుకొనును. అన్యురాలయినటువంటి యెజెబెలు రాజ్యములో ప్రవక్తయైన ఏలియాకు ఆశ్రయము దొరుకుట యనెడి ఒక విశేషము. ఆయన తన అద్భుత కార్యములను జరిగించుటకు దేవుడు కొన్ని అసాధారణ పరిస్థితులను కల్పించుకొనును.

ఫోనీకేలోని స్త్రీలందరు యెజెబెలు వలె దుర్మార్గులని మనము చెప్పజాలము. వారి గుణమును బట్టికాక, వారి జాతినిబట్టిగాని, వారి ఉనికినిబట్టి గాని మనము మనుష్యులకు తీర్పు తీర్చరాదు.

నిజమైన స్నేహితుడు విడువక ప్రేమించును. దుర్దశలో అట్టి వాడు సహోదరుడుగ యుండును (సామెతలు 17:17). ఇచ్చి పుచ్చుకొనుట కొరకు దేవుడు ఒక చట్టము యేర్పాటుచేసెను. ఇయ్యుడి, అప్పుడు మీకియ్యబడును (లూకా 6:38).

కొన్ని అసాధారణ స్థలములయందు కూడ మనము విశ్వాసమును చూడగలము. అన్యదేశమైన ఫోనీకేయందు కూడ విశ్వాసము కలిగియుండిన కొద్దిమంది యూదులను చూడగలము. ఒక వ్యక్తిని గాని, లేక ఒక జనాంగమును గాని మనము వారి క్రియలనుబట్టి గాక వారి రంగను బట్టియు, వారి ఆర్థిక స్థితిని బట్టియు, లేక మతమును బట్టియు మంచి, చెడు నిర్ధారణ చేయగూడదు. మానవాళి కంతటికి సువార్త అవసరము. నమ్మకమైన, మంచి మనసుగల వారనేకులు దేవుని సువార్త వినుటకొరకు ఆశతో కనిపెట్టుచున్నారు.

బాధ, మరణముల నుండి తప్పించుకొనే గృహముండదు. చివరకు పరిశుద్ధులైనటువంటి వారుకూడ ఈ భారమును భరింపవలెను. (హెబ్రీ 9:27). ఎవరైతే తన జీవితములో దేవుని ముందు పెట్టుకొనె

దరో వారు గాఢాంధకారపు లోయలో సంచరించినను దేవుడు వారికి తోడై యుండును (కీర్తనలు 23 : 4).

మనకు తెలియని వారియెడల కూడ ప్రేమ చూపుటకు మరచిపోరాదు. భక్తులలో కొంత మంది తెలియకయే దేవదూతల కాతిథ్యమిచ్చిరి (హెబ్రీ 13:2).

—జాన్ వాడీ.

---

## అచ్చ జటామాంసి అత్తరు బుడ్డి పగుల గొట్టుట
## ( Breaking the Alabaster Box )

యేసు బేతనియలో యుండినప్పుడు అక్కడివారు కుష్ఠురోగియైన సీమోను యింట ఆయనకు విందు చేసిరి. మార్త ఉపచారము చేసెను. లాజరు ఆయనతో కూడ భోజనమునకు కూర్చున్న వారిలో ఒకడు.

ఆయన అచ్చట యుండినపుడు ఒక స్త్రీ (మరియ) మిక్కిలి విలువగల అచ్చ జటామాంసి అత్తరు ఒక సేరున్నర ఎత్తు తీసికొని, పగులగొట్టి ఆయన తలమీద పోసి ఆయన పాదములను తన తలవెండ్రుకలతో తుడిచెను. ఇల్లు అత్తరు వాసనతో నిండెను. ఆయన శిష్యులలో ఒకడు అవగా ఆయనను అప్పగింపనై యున్న ఇస్కరియోతు యూదా - ఈ అత్తరెందుకు మూడు వందల దేనారములకు అమ్మి బీదలకు ఇయ్యలేదనెను. అతడీలాగు చెప్పినది బీదలమీద శ్రద్ధ గలిగి కాదుగాని వాడు దొంగయైయుండి, తన దగ్గర డబ్బు సంచి యుండినందున అందులో వేయబడినది దొంగిలించుచు వచ్చెను గనుక ఆలాగు చెప్పెను. శిష్యులు ఇది చూచినపుడు వారిలో కొందరు కోపపడి ఈ నష్టమెందుకు! ఇంత విలువైన అత్తరు ఎందుకు పాడు

చేయాలి? మూడు వందల దేనారములకు పైగా దీనిని అమ్మి బీదలకు ఈయవచ్చును గదా అని ఆమె మీద సణగుకొనిరి.

అయితే యేసు ఇది ఎరిగినవాడై మీరామెను ఎందుకు తొందర పెట్టుచున్నారు. ఈమె జోలికి పోకుడి. ఈమె నా యెడల మంచి కార్యము చేసెను. ఈమె తన శక్తికొలది చేసి నా భూస్థాపన నిమిత్తము నా శరీరమును ముందుగా అభిషేకించెను. బీదలు యెల్లప్పుడు మీతోనే యున్నారు. మీ కిష్టమైనప్పుడెల్ల వారికి మేలు చేయవచ్చును. నేను యెల్లప్పుడు మీతో యుండను. సర్వలోకములో ఎక్కడ ఈ సువార్త ప్రకటింపబడునో అక్కడ ఈమె చేసినదియు జ్ఞాపకార్థముగ ప్రశంసింపబడునని మీతో నిశ్చయముగ చెప్పుచున్నా ననెను (మత్తయి 26, మార్కు 14, యోహాను 12).

## పరిచర్య

ఇది స్వపరిచర్య మాత్రమే గాక దానికంటె ఎంతో యెక్కువైనట్టిది. అది పొరుగు వారి క్షేమమును గూర్చిన గ్రహింపుగలిగి జీవించుట యనేది. మీలో యెవడు గొప్పవాడై యుండగోరునో వాడు మీ పరిచారకుడై యుండవలెను; మీలో యెవడు ముఖ్యుడై యుండగోరునో వాడు మీ దాసుడై యుండవలెను. అలాగే మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదుగాని పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగ తన ప్రాణము నిచ్చుటకును వచ్చెనని చెప్పెను (మత్తయి 20:26-28).

ఇది ఒక అసాధరణమైన ప్రక్రియ. తన్ను తాను పరిత్యజించుకొని ఇతరులకు పరిచర్య చేయుటలో కొన్నిసార్లు సంతోషముండక పోవచ్చు. అందుకొరకు పౌలు ఈ విధంగా చెప్పుచున్నాడు: కాబట్టి మనకు సమయము దొరికిన కొలది అందరి యెడలను, విశేషముగ

విశ్వాస గృహమునకు చేరిన వారి యెడలను మేలు చేయుదము (గలతి 6:10). మంచి చేయుటను గూర్చి ఆలోచించుట మాత్రమే గాక దాని చేయవలెను అని యాకోబు చెప్పుచున్నాడు. ప్రాణములేని శరీరమేలాగు మృతమో ఆలాగే క్రియలులేని విశ్వాసమును మృతము (యాకోబు 2:26). యేసు మేలుచేయుచు సంచారము చేసెను. విశ్వాసమును, మంచి క్రియలను మనము వేరు చేయరాదు.

మన పరిచర్య క్రీస్తుకును, ఆయన బిడ్డలైన వారికిని యుండవలెను. మిక్కిలి అల్పులైన ఈ నాసహోదరులలో ఒకనికి మీరు చేసితిరని గనుక నాకు చేసితిరని నిశ్చయముగ మీతో చెప్పుచున్నాను (మత్తయి 25:35-40). ఎవరి స్వవిషయములను వారు చూచుకొనుట మాత్రమే గాక యితరుల విషయములను గూర్చి కూడ ఆలోచన కలిగియుండవలెను (ఫిలిప్పి 2 : 4). ఈ భూలోకములో యున్నవారి నందరిని యేసునైపుకును ఆయన మార్గముల ననుసరించి జీవించుటకును నడిపించునట్లు చేయవలెను. పరిచర్య యనే అచ్చ జటామాంసి అత్తరును గూర్చి నీ ఆలోచన యేమిటి? నీవు దానిని పగులగొట్టెదవా లేక పూర్తిగ విడిచిపెట్టెదవా?

## సమర్పణ

మనకున్న దానిలో శ్రేష్టమైన దానిని దేవుని కిచ్చెదమా? నిశ్చయముగా ఇచ్చెదమా? ఇశ్రాయేలీయుల కట్టడ ప్రకారము యెహోవాను ప్రతిష్టించునది రెండవదిగాని, తృణీకరింప బడినదిగాని అయియుండకూడదు. ఉన్న వాటిలో శ్రేష్టమైనవి. తొలిపిల్ల యెహోవాకు ప్రతిష్ఠితము. దావీదు యెహోవాకు బలి అర్పించుట కొరకు బలిపశువును, ఆ స్థలమును కూడ వెల యిచ్చి కొనెను. రాజు- నేనాలాగు తీసికొనను, వెల యిచ్చి నీయొద్ద కొందును, వెల ఇయ్యక

నేను తీసికొనిన దానిని నా దేవుడైన యెహోవాకు దహన బలిగా అర్పించనని అదే నాతో చెప్పి ఆ కళ్ళమును, ఎడ్లను ఏబది తులముల వెండికి కొనెను (2 సమూయేలు 24:24). తన కొరకు ఉంచుకొనవలెనని దేనిగూర్చి ఉద్దేశము కలిగి యుండునో అట్టి శ్రేష్టమైన దానిని మాత్రమే దేవునికి ప్రతిష్ఠించవలెను.

మనకు గల విలువైన వస్తువులు, వ్యక్తులు, విషయములు - అనే అచ్చ జటామాంసి అత్తరును దేవునికి సమర్పించుదమా? మాసిదోనియా సంఘము వారియొక్క దాతృత్వమును మనము జ్ఞాపకము చేసికొందము. ఇదియుగాక మొదట ప్రభువునకును, దేవుని చిత్తమువలన మాకును, తమ్మును తామే అప్పగించుకొనిరి; ఇంతగా చేయుదురని మేమనుకొనలేదు (2 కొరింథి 8:5). నేను ఈ మధ్య దేవునికి యేమి సమర్పించితిని? అట్టి సమర్పణను బట్టి నాకు సంతోషము కలిగినదా? అని ప్రశ్నించుకొందము.

ఆత్మ తృప్తి అనే అచ్చ జటామాంసి అత్తరును దేవునికి సమర్పించుదమా? జీవించుచున్నావన్న పేరుమాత్రము మున్నదిగాని నీవు మృతుడవే యని సార్దీస్ సంఘమునకు హెచ్చరిక చేయబడినది (ప్రకటన 3 : 1).

స్వీయ చిత్తము అనే అచ్చ జటామాంసి అత్తరును దేవునికి సమర్పించుదమా? యెహోవా, తమ మార్గము నేర్పరచుకొనుట నరుల వశములో లేదనియు, మనుష్యులు తమ ప్రవర్తన యందు సన్మార్గమున ప్రవర్తించుట వారి వశములో లేదనియు నేనెరుగుదును (యిర్మీయా 10 : 23). దేవుడు తన చిత్తానుసారముగ మనలను నడిపించునట్లుగ మనము ఒప్పుకొందుమా? లేక మొండిగ తిరుగబడుదుమా ?

మన ఉద్దేశ్యములు, సంకల్పములు యేమిటి? బహుమతులు, శిక్షలు తీసికొనుచూ మనము కొనసాగుదమా? లేక విధి నిర్వాహక జ్ఞానము కలిగి యుందమా? మరియు వలె ప్రేమతో కూడిన క్రియలు చేయుదమా? లేక మన సమర్పణలు దేవునిని లేక మానవుని సంతోష పెట్టునవిగానె యున్నవా? (మత్తయి 6:1-6). సమర్పణ అనే అచ్చ జటామాంసి అంతరు బుద్ధిని పగులగొట్టుదమా?

## పరిశుద్ధత

పరిశుద్ధ పరచబడుట యనేది ఒక ప్రత్యేక ఉద్దేశముతో కూడినది. మీలో కొందరు అట్టివారై యుంటిరిగాని, ప్రభువైన యేసు క్రీస్తు నామమునను మన దేవుని ఆత్మయందు మీరు కడుగబడి, పరిశుద్ధపరచబడినవారై నీతిమంతులుగా తీర్చబడిరి (1 కొరింధి 6:11). పరిశుద్ధత యనేది దైవికమైనది. అది నీతితో కూడినది. శరీరేచ్ఛలను, లోకేచ్ఛలను క్రీస్తు ప్రభువులో వాటిని మృతమైనవిగా ఎంచవలెను.

అటువంటి పరిశుద్ధ జీవితమును జీవించుచుండినపుడు మనము లోకానుసారమైన మాటలు చెప్పము, లేక ఆలోచించము, లేక మన వస్త్రధారణ, మన క్రియలు లోకానుసారమైనవై యుండవు. రోమీయుల వలె మార్పు గలిగిన జీవితములు మనకు కలుగును (రోమా 1:26). మన జీవితములలో క్రైస్తవ కృపలు అధికమగునట్లు జీవించుటలో తొందర కలిగియుందుము (2 పేతురు 1:5). నీతి ఫలములు ఫలించుదుము (గలతి 5:22). పరిశుద్ధమైన జీవితములు జీవించుటయనేది స్వల్ప విషయముకాదు. మనము దేవుని సారూప్యముగల వారముగా మార్చబడవలెను (రోమా 8:29).

మనకున్న దానిలో శ్రేష్టమైన దానిని మనకొరకుంచుకొని, దేవుని కిచ్చుటలో పిసినితనముగా కొంచెము, కొంచెమే యిచ్చు

చున్నామా! బైబిలు ప్రకారము మన జీవితములు ఒక ప్రత్యేక మైనవిగా కనబడుచున్నవా? మన ప్రభువైన యేసు కొరకు మన ప్రేమంతయు ఆయన కొరకు సమర్పించుచవా? క్రీస్తు ప్రభువు సేవ చేయుటలో మనము సంపూర్ణ సమర్పణ జీవితములను కలిగి యుందము.

—ఫిల్ డేవిస్.

---

## చారిత్రాత్మక ఋజువు

### ( Historical Evidence )

యేసుక్రీస్తు దేవుని కుమారుడని నిరూపించు యొక చారిత్రాత్మక ఋజువును చూద్దాం. క్రీ॥శ॥ 52 లో రోమా పట్టణములోని తల్లస్ (Thallus) అను చరిత్రకారుని వివరణ విందాం. ఇతడు సమరయలో జన్మించెను. అతడు రచించినవి అనేకము లున్నను, వాటిలో కొన్ని మాత్రమే ఈ కాలములో మిగిలి యున్నవి. మరియొక చరిత్ర కారుడు జూలియస్ ఆఫ్రికానస్ (Julius Africanus). ఇతడు రెండవ శతాబ్దపు కాలమువాడు. ఈతడు తల్లస్ యొక్క వ్రాతలను పరిశీంచి యిట్లు వ్రాసెను; "తల్లస్ (Thallus) తన చరిత్ర పుస్తకములలో 'ఈ చీకటి' సూర్య గ్రహణము వలన కలిగినది" యని వివరించెను (Edward C. Wharton Christianity, A Clear Case of History! Howard Book House, West Monroe, LA, 1977, P6).

'ఈ చీకటి' అనగా యేసుక్రీస్తు సిలువ వేయబడినపుడు ఆ దేశమంతట మూడు గంటలు కమ్మిన చీకటి. "మధ్యాహ్నము మొదలుకొని మూడు గంటల వరకు ఆ దేశమంతటను చీకటి కమ్మెను" (మత్తయి 27:45; మార్కు 15:33).

ఇది దైవికమైనది కాదని కేవలము ప్రకృతి సంబంధమైనదని, సూర్యగ్రహణము వలననే సంభవించెనని తల్లస్ వాదన. సూర్య గ్రహణం సాధారణంగా చంద్రగోళము సూర్యగోళమునకు భూగోళమునకు మధ్య ప్రయాణము చేయునప్పుడు మాత్రమే యేర్పడునని సైన్సు చెప్పుచున్నది.

అయితే, ఈ చీకటి సూర్యగ్రహణము వలన కలుగలేదని ఆఫ్రికానస్ (Africanus) చెప్పుచున్నాడు. ఎందుకనగా సూర్య గ్రహణం పూర్ణచంద్రుని దినములలో కలుగదు. యేసుక్రీస్తు పస్కా పండుగ దినములలో సిలువ వేయబడెనని, అవి పౌర్ణమి రోజులని అతడు వివరించెను.

తల్లస్ క్రీస్తుకు వ్యతిరేకి. అతడు క్రీస్తు దేవుని కుమారుడని నమ్మెడివాడు కాడు. ఏదయితేనేం, మొత్తానికి అతడు క్రీస్తు సిలువ వేయబడు సమయాన చీకటి కమ్మినదని ఒప్పుకొనుచున్నాడు. అతడు ఆ చీకటి కమ్ముటకు గల కారణమును మాత్రము ఒప్పుకొనుటలేదు. ఈ చరిత్రకారుడు AD 52 లో మూడు కారణములను బట్టి బైబిలు చారిత్రాత్మకంగా యథార్థమని ఒప్పుకొనుచున్నట్లే; (1) యేసుక్రీస్తు భూమిపై పుట్టిన వ్యక్తి యని (2) ఆయన సిలువ వేయబడ్డాడని (3) ఆ సమయమున చీకటి కమ్మినదని.

నజరేయుడు యేసుక్రీస్తు ఒక కల్పిత వ్యక్తి గాదు; బైబిలు పుక్కిట పురాణము అంతకంటె కాదు. మానవ చరిత్రకారులంతా క్రీస్తు ఒక నిజమైన వ్యక్తి యని, ఆయన ఈ భువిపై జీవించెనని గ్రహించిరి. క్రొత్త నిబంధన అంతయు నజరేయుడగు యేసుక్రీస్తు నిజముగ దేవుని కుమారుడని, ఆయన దైవత్వాన్ని గుర్తింపచేయు అనేక సాక్ష్యములతో ఋజువు పరచెను.

"యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్ము నట్లును నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను" (యోహాను 20 : 31).

—రోయ్‌స్ ఫ్రెడ్రిక్.

---

బైబిలు పాఠం :

## విలువపెట్టి కొనబడినవారు

## ( Bought with a Price )

పరిచయం :

1. "మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి, మీలో నున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీ రెరుగరా ? మీరు మీ సొత్తుకారు, విలువపెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమ పరచుడి" (1 కొరి 6 : 19-20).

2. "అందుకు యేసు అతనితో - ఒకడు క్రొత్తగా జన్మించితేనేకాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నా ననెను" (యోహాను 3:3).

3. "వెండి బంగారములవంటి క్షయ వస్తువులచేత మీరు విమోచింప బడలేదు గాని, అమూల్యమైన రక్తముచేత అనగా నిర్దోషమును, నిష్కళంకమునగు గొర్రెపిల్లవంటి క్రీస్తు రక్తముచేత మీరు విమోచింపబడితిరి" (1 పేతురు 1:18-19).

4. దేవుని వలన జనింపజేయబడి గొర్రెపిల్ల రక్తముచేత కడుగబడిన పిల్లలు తమ ప్రవర్తన విషయమై జాగ్రత్తగా యుండాలి.

చర్చనీయాంశము :

I. క్రీస్తులో నూతన సృష్టియైన వాని నూతన జీవితం పవిత్రమైనది.

(A) నీవు దేవుని బిడ్డవైతే, నీ శరీరము పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నది (1 కొరి 6:19). అంటే అది అతి పరిశుద్ధ స్థలమన్న మాట! మనం పవిత్రంగా లేకపోతే మన శరీరాలతో దేవుని మహిమ పర్చలేము.

(B) మనకు మనమే పవిత్రంగా యుండాలని క్రొత్త నిబంధన వక్కాణించు చున్నది.

1. "హృదయ శుద్ధిగలవారు ధన్యులు, వారు దేవుని చూచెదరు" (మత్తయి 5 : 8).

2. "జీవమును ప్రేమించి మంచి దినములు చూడగోరువాడు చెడ్డదాని పలుకకుండ తన నాలుకను, కపటపు మాటలు చెప్పకుండ తన పెదవులను కాచుకొనవలెను" (1 పేతురు 3:10).

3. "ప్రియులారా, మనకు ఈ వాగ్దానములు ఉన్నవి గనుక దేవుని భయముతో పరిశుద్ధతను సంపూర్తి చేసికొనుచు, శరీరమునకును ఆత్మకును కలిగిన సమస్త కల్మషమునుండి మనలను పవిత్రులనుగా చేసికొందము" (2 కొరింథీ 7 : 1).

4. సంఘము "కళంకమైనను, ముడతయైనను అట్టిది మరి ఏదైనను లేక పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైనదిగాను" యుండునట్లు యేసు క్రీస్తు సంఘముకొరకు తన ప్రాణ మర్పించెను (ఎఫెసీ 5:26-27).

5. "ఆయన నన్ను శోధించిన తరువాత నేను సువర్ణమువలె కనబడుదును" అని యోబు చెప్పుచున్నాడు (యోబు 23:10).

6. "నశించిపోవుసువర్ణము అగ్ని పరీక్షవలన శుద్ధపరచబడుచున్న దిగదా? దానికంటె అమూల్యమైన మీ విశ్వాసము ఈ శోధనలచేత పరీక్షకు నిలిచినదై, యేసుక్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మీకు మెప్పును మహిమయు ఘనతయు కలుగుటకు కారణమగును (1 పేతురు 1:7).

7. "తండ్రియైన దేవుని యెదుట పవిత్రమును నిష్కళంకమైన భక్తి యేదనగా - దిక్కులేని పిల్లలను విధవరాండ్రను వారి యిబ్బందిలో పరామర్శించుటయు, ఇహలోక మాలిన్యము తన కంటకుండ తన్ను తాను కాపాడుకొనుటయునే" (యాకోబు 1:27).

8. "ఈ లోకమునైనను లోకములో ఉన్నవాటినైనను ప్రేమింపకుడి. ఎవడైనను లోకమును ప్రేమించిన యెడల తండ్రి ప్రేమ వానిలో నుండదు. లోకములో ఉన్నదంతయు, అనగా శరీరాశయు నేత్రాశయు, జీవపుడంబమును తండ్రివలన పుట్టినవికావు; అవి లోకసంబంధమైనవే లోకమును దాని ఆశయు గతించిపోవుచున్నవి. గాని దేవుని చిత్తమును జరిగించువాడు నిరంతరము నిలుచును (1 యోహా 2:15-17).

9. "మీరు ఈలోక మర్యాదను అనుసరింపక ఉత్తమమును, అనుకూలమును సంపూర్ణమునైయున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతనమగుటవలన రూపాంతరము పొందుడి" (రోమా 12:2).

10. "ప్రతి విధమైన కీడునకును దూరముగా ఉండుడి" (1 థెస్స 5:22).

## C) మనం పరిశుద్ధతను ఎట్లు పొందగలము? దాన్ని ఎట్లు కాపాడుకోగలము?

1. దేవుని వాక్యమును ఎరుగుటద్వారా: "నీయెదుట నేను పాపముచేయకుండునట్లు, నా హృదయములో నీ వాక్యము ఉంచు

కొని యున్నాను" (కీర్తన 119:11). "దేవుని మూలముగా పుట్టిన ప్రతివానిలో ఆయన బీజము నిలుచును గనుక వాడు పాపము చేయడు; వాడు దేవునిమూలముగా పుట్టినవాడు గనుక పాపము చేయజాలడు" (1 యోహాను 3:9).

2. పరలోకమును గూర్చి ధ్యానించుటద్వారా: "ప్రియులారా యిప్పుడు మనము దేవుని పిల్లలమై యున్నాము. మనమింక ఏమగుదుమో అది ఇంక ప్రత్యక్షపరచబడలేదుగాని, ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము. గనుక ఆయనను పోలియుందుమని యెరుగుదుము. ఆయనయందు ఈ నిరీక్షణ పెట్టుకొనినవాడును ఆయన పవిత్రుడై యున్నట్టుగా తన్ను పవిత్రునిగా చేసికొనును" (1 యోహా 3:2-3).

3. ఒకనినొకడు పురికొల్పుటద్వారా: "ప్రేమ చూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్పవలెనని ఆలోచింతము" (హెబ్రీ 10:24).

4. క్రమశిక్షణద్వారా: "నీ కుడికన్ను నిన్ను అభ్యంతర పరచిన యెడల దాని పెరికి నీయొద్దనుండి తీసిపారవేయుము. నీ దేహమంతయు నరకములో పడవేయబడకుండ నీ అవయవములలో ఒకటి నశించుట నీకు ప్రయోజనకరము గదా. నీకుడి చెయ్యి నిన్నభ్యంతరపరచిన యెడల దాని నరికి నీయొద్దనుండి పారవేయుము; నీ దేహమంతయు నరకములో పడకుండ నీ అవయవములలో ఒకటి నశించుట నీకు ప్రయోజనకరముగదా" (మత్తయి 5:29-30).

ప్రతి స్థానిక సంఘము దానిలో యున్న నైతిక సద్వర్తనములేని సభ్యులయెడల క్రమశిక్షణను పాటించవలెను (1 కొరి 5:1-13; తీతు 3:10).

(సశేషం)

# సంక్షిప్త వార్తలు

ఏప్రిల్ నెల సువార్తికుల సమావేశము పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంచిలి ( ఆచంటకు 2 కి. మీ) గ్రామంలో జరిగెను. ఆ ప్రాంతములో దేవుని మహిమార్థమై గొప్ప పనిని జరిగించుచున్న సోదరులు ఏకమనస్సుతో పనిచేసి ఆశీర్వాదకరమైన మరియు ఆశ్చర్యకరమైన ఫలితములను చూడగలిగిరి. "విశ్వాసము మాత్రమే రక్షించునా?" అను అంశముపై యస్. ఎబినెజరుగారు (పాలకొల్లు) చర్చ ప్రారంభించిరి. అధ్యక్షత వహించిన వడ్డి చిన్నయగారు మాట్లాడుచూ 'విశ్వాసము వలన ఒకడు రక్షింపబడునని (అపొ. 16:31), విశ్వాసము మాత్రమే రక్షింపజాలదని' తెలియజేసిరి. బొబ్బర్లంక నుండి వచ్చిన యస్. సత్యంగారు మాట్లాడుచూ అనేక దృష్టాంతములను చూపి విశ్వాసముయొక్క అవసరాన్ని గుర్తుచేసి విశ్వాసము ఒంటిగా ఉండరాదని తెలియజేసిరి. పాల్ గూటంగారు (గొల్లవిల్లి) మాట్లాడుచూ ఈ అంశముపై కొన్ని నూతన తలంపులను వాఖ్యానుసారముగా అందించిరి. మన రక్షణలో విశ్వాసముయొక్క స్థానమేమి? "విశ్వాసము రక్షించు"నని లూకా 7:50 నందు "బాప్తిస్మము రక్షించు"నని 1 పేతురు 3:21 నందు బైబిలు బోధించుచున్నది. విశ్వాసమునకు బాప్తిస్మమునకు గల సంబంధమేమిటో వివరించిరి. విశ్వాసమునకు విధేయులగుట అంటే బాప్తిస్మము పొందుట రక్షణకు అవసరమని, సత్యమును మరియు ఉపదేశక్రమమును మనం విశ్వసించాలని, బాప్తిస్మమును నిరాకరించువారు మానవుల పాపక్షమాపణకై దేవుడిచ్చిన సంకల్పమును విశ్వసించుటలేదని తెలియజేసిరి.

మధ్యాహ్న సమయములో సోదరులు ఇ. కె.వి. ప్రసాదరావు గారు సభకు అధ్యక్షత వహించగా ప్రియ సోదరులు బైబిలు సెమినార్ నిర్వాహకులు, కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రిచింగ్ డైరెక్టరు నెహెమ్యా గూటంగారు ఈ అంశముపై చక్కని వివరణ యిచ్చిరి. "విశ్వాసము మాత్రమే" (Faith Alone) అను ఈ అబద్ధ సిద్ధాంతముయొక్క చరిత్రను తెలియజేసిరి. రోమన్ కేథలిక్కులు ప్రవేశపెట్టిన ఈ సిద్ధాంతమును ఉద్దుబాటు ఉద్యమనాయకుడైన మార్టిన్‌లూథరు విశ్వసించుట వలన మతశాఖలలో ఈ సిద్ధాంతము యింతవరకు బోధింపబడుచున్నదని చెప్పిరి. "విశ్వాసమువలననే" అను మాట గలతి 2 : 16లో తెలుగు

బైబిలు నందు కనబడుచున్నది. అనువాదకులు తెలుగు బైబిలులో "వలన" అను అర్ధమువచ్చు మూలపదానికి పొరపాటున "వలననే" అని అనువదించిరి అని ఆసక్తికరమైన విషయములు వెల్లడించిరి. యాకోబు 2:14ను అందరికి అర్ధమయ్యే రీతిలో వివరించిరి.

సోదరులు N. మోజెస్‌గారు (కరుగోరుమిల్లి), K. ప్రసాద్ గారు (ఆచంట) M. జోసఫ్‌గారు (పెనుమంచిలి) మరియు P. సమూయేలు గారు (ఆచంట) నాయకత్వము వహించగా గొప్ప సువార్త దండయాత్ర చేసి పెనుమంచిలి గ్రామమంతయు తిరిగి రక్షణ మార్గాన్ని వివరించే కరపత్రాలను పంచిపెట్టిరి. 5 గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. 1992 వ సంవత్సరములో జరిగిన 4 సమావేశాలలో (పాలగుమ్మి, కంటి, లక్ష్మిపోలవరం & పెనుమంచిలి) మొత్తం 26 మంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిరి. రాత్రి కూటమునకు సోదరులు N. ఏలియాగారు అధ్యక్షత వహించగా "విధేయత" (Obedience) అను చక్కని మరియు అవసరమైన అంశముపై నెహెమ్యా కూటంగారు సువార్త నందించిరి. ★

---

Regd. No. H/KD—45/KD H.O.

*From*
**SATYA WAKKU**
P.O. Box 80
KAKINADA 533 001

**No.**

**To**

..........................................................

..........................................................

..........................................................

..........................................................